క్లుప్తంగా

వైభవంగా వజ్ర వారాహి మూల మంత్ర సాధన



హోమాన్ని నిర్వహిస్తున్న అక్షయ పాత్ర ప్రతినిధులు, భక్తులు

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్ నగర్‌లోని శ్రీఆదిశేష నిలయంలో శ్రీ గౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం జరుగుతున్న వారాహి షోడశ రాత్రి మహోత్సవాలు శనివారం నాటికి ఆరో రోజుకు చేరుకున్నాయి. వజ్ర వారాహి మూల మంత్ర సాధనతో భక్తులు హోమాన్ని వైభవంగా నిర్వహించారు. అఖండ భారతావనిలో హిమాలయ ప్రాంతాలు విస్తరించి ఉన్న ఇతర దేశాలు నేపాల్, టిబెట్, మంగోలియా, చైనా బౌద్ధ మత సాధకులు అమితంగా ఆరాధించే దేవతల్లో వజ్ర వారాహి ఒకరని అక్షయ పాత్ర ప్రతినిధులు తెలిపారు.

సమాజ సమగ్ర అభివృద్ధికి కృషి

ఐ.పోలవరం: సమాజ, విద్యారంగ సమగ్ర అభివృద్ధికి జన విజ్ఞాన వేదిక గత 35 సంవత్సరాలుగా కృషి చేస్తుందని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు జనిపెల్ల సత్యనారాయణ అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో శనివారం సభ్యత్వాలు చేర్పించే కార్యక్రమం నిర్వహించారు. జులై నెలలో మండల, పట్టణ కమిటీలకు, ఆగస్టులో జిల్లా కమిటీలకు, సెప్టెంబరులో రాష్ట్ర కమిటీకి మహా సభలు నిర్వహిస్తామని జనరల్ సెక్రటరీ కేవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. కార్యక్రమానికి మురమళ్ల జెడ్పీ పాఠశాల హెచ్ఎం కె.వెంకటలక్ష్మి, ఐ.పోలవరం జెడ్పీ పాఠశాల హెచ్ఎం వీధి సురేష్‌బాబులు సభ్యత్వ నమోదు ప్రారంభించారు.

రమణశ్రీకి సత్కారం



రమణశ్రీని సత్కరిస్తున్న నాయకులు

ముమ్మిడివరం: పదో తరగతి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించిన జిల్లా ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్, మండల విద్యాశాఖాధికారి బొజ్జా రమణశ్రీని స్థానిక ఎంఈఓ కార్యాలయంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు కోలా బాబ్జి తదితరులు శనివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 రాయుడు ఉదయ భాస్కరరావు, రాష్ట్ర ఎస్టీయూ నాయకులు కేవీ శేఖర్, జీవీవీ సత్యనారాయణ, ఎస్ఎస్ మునేశ్వరరావు, జె.భీమారావు తదితరులు పాల్గొన్నారు.

సాగు నీరందించండి

అల్లవరం: తాడికోన కాలువ పరిధిలోని కోడూరుపాడు, గూడాల, తాడికోన గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలకు సాగు నీరందక నారమళ్లు ఆలస్యమవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూన్ 5 నాటికి కాలువలకు సాగు నీరు విడుదల చేసినా నేటికీ పూర్తి స్థాయిలో సాగునీరు రావడం లేదని రైతులు పాటి సింహాద్రి, కూనవరపు సత్యనారాయణ, యార్లగడ్డ రామకృష్ణ తదితరులు తెలిపారు. తమ సమస్యను ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి సాగునీరందేలా చూడాలని కోరుతున్నారు.

సీజ్ చేసిన ప్రజా పంపిణీ బియ్యం వేలం

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలంలో అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన 310.44 క్వింటాళ్ల ప్రజా పంపిణీ బియ్యాన్ని ఈ నెల 30న అమలాపురం కలెక్టర్ కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ యడ్ల రాంబాబు తెలిపారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనొచ్చని చెప్పారు.

30న కొత్త అసెంబ్లీ బిల్డింగ్ మ్యాప్ రిపోర్టు

యానాం: పుదుచ్చేరి అసెంబ్లీ నూతన భవన నిర్మాణ మ్యాప్‌కు సంబంధించిన రిపోర్టు ఈ నెల 30 నాటికి వస్తుందని స్పీకర్ ఆర్.సెల్వం తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 15 ఎకరాల విస్తీర్ణంలో తట్టన్‌చావిడి ప్రాంతంలో అసెంబ్లీ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.440 కోట్ల మంజూరుకు ఇప్పటికే అంగీకరించిందన్నారు. ప్రస్తుత నిర్మాణంలో ఆధునిక ఎలక్ట్రానిక్ డివైజెస్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొత్త అసెంబ్లీ నిర్మాణంలో భాగంగా శాసనసభ్యుల బృందం త్వరలో ఢిల్లీలోని నూతన పార్లమెంట్ భవనాన్ని పరిశీలిస్తారన్నారు.

కొమరగిరిలో ఫెయిత్ హోమ్ చర్చి ప్రారంభం

ఐ.పోలవరం: మండలంలోని కొమరగిరి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఫెయిత్ హోమ్ చర్చిని శనివారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి రెవా స్టీవెన్ ఆనంద్, డాక్టర్ ఎంఎస్ విలియమ్స్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు సందేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, సర్పంచ్ విజయ చాముండీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రైతు ఇంట.. ఆనందాల పంట..

- రబీలో అంచనాలకు మించి ధాన్యం దిగుబడులు
- ఎకరాకు 50 బస్తాలు పైనే పంట
- పండిన ప్రతి గింజా ప్రభుత్వం కొనుగోలు



రబీలో ఆశాజనకంగా పండిన వరి చేలు

ముమ్మిడివరం: ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేస్తుంది. రైతు భరోసా కేంద్రాల్లో(ఆర్‌బీకే) విరివిగా ఎరువులు, విత్తనాలు సరఫరా చేయడంతో పాటు సబ్సిడీపై యాంత్రీకరణ పరికరాలు పంపిణీ చేస్తుంది. దీనికి తోడు రైతు భరోసా కింద ఇస్తుననగదు ఏటా రైతులకు పెట్టుబడి సాయంగా ఉపయోగపడుతుంది. మరోవైపు వ్యవసాయ బీమా, కనీస మద్దతు ధరతో ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయడంతో అన్నదాతలకు భరోసా లభిస్తుంది. మరోవైపు రబీలో వాతావరణం సైతం కలిసి రావడంతో అంచనాలకు మించిన దిగుబడులు వచ్చాయి. అయితే ఆఖరులో అకాల వర్షాలు అన్నదాతను ఉక్కిరిబిక్కిరి చేసినా ప్రభుత్వం నిబంధనలు సడలించి తడిసిన ధాన్యం సైతం కొనుగోలు చేయడంతో రైతు ఇంట ఆనందాల పంట పండింది.

ప్రభుత్వమే పెద్దదిక్కు

అన్నదాతలకు అన్నివిధాలా ప్రభుత్వమే పెద్దదిక్కుగా నిలబడుతోంది. వాతావరణం అనుకూలించి, తెగుళ్ల బెడద తక్కువగా ఉండటం సాగునీటి ఎద్దడికి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో గత రబీలో రైతులు అంచనాలకు మించి దిగుబడులు సాధించారు. చివరలో వచ్చి పడిన వర్షాలు ఇబ్బంది కలిగించినా అధికారులు యుద్ధ ప్రాతిపదికన తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేయడంతో రైతులు ఎటువంటి నష్టం లేకుండా గట్టెక్కారు. సీజన్ చివరలో భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వ యంత్రాంగం వేగంగా స్పందించింది. రైతులకు చేదోడుగా జాతీయ ఉపాధి హామీ పథకంలో నీట మునిగిన పనలను ఒబ్బిడి చేయడం, ధాన్యం రాశులు, చేలలో ఉన్న నీరు దిగేలా బోదెలు వేయించడం చేశారు. దీంతో ప్రకృతి వైపరీత్యాన్ని సైతం ఎదుర్కొని పంట దిగుబడులను కాపాడుకోగలిగారు. దీంతో అంచానలకు మించి ఎకరానికి 50 బస్తాల పైగానే దిగుబడి సాధించారు. పండిన ప్రతి గింజా ప్రభుత్వమే కొనుగోలు చేయడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది.

రైతు భరోసా, పీఎం కిసాన్ పథకంలో ప్రభుత్వ సాయం ఇలా..

సంవత్సరం	రైతులు	ఆర్థిక సాయం
2019-20	7471	రూ.14,84,74,500
2020-21	8815	రూ.15,73,80,000
2021-22	7991	రూ.11,42.26.500
2022-23	8052	రూ.11,43,78,000
2023-24	8362	రూ.11,67,03,000

18,216 మెట్రిక్ టన్నుల దిగుబడి



పంట దిగుబడులను అంచనా వేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

గత రబీ సీజన్‌లో మండలంలో 6,100 ఎకరాలలో వరి సాగు చేశారు. సుమారు 19,215 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది. అధికంగా ఎంటీయూ-1121, బొండాలు రకాలు సాగు చేశారు. ఎకరాకు 42 నుంచి 50 బస్తాలపైగా దిగుబడి వచ్చింది. మండలంలో 12 రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేసింది. రబీ సాగు ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. గత ఐదు సంవత్సరాల్లో రైతు భరోసా, పీఎం కిసాన్ పథకంలో మండలంలో 8,362 మంది రైతులకు రూ.65,11,62,000 నగదు సాయం అందజేశారు. ఈ ఏడాది 30 శాతం సబ్సిడీపై రూ.1.50 లక్షలు విలువ చేసే యంత్ర పరికరాలు రైతులకు అందజేశారు. ఎరువులు, విత్తనాలు సైతం సబ్సిడీపై ఇస్తున్నారు.

ఆర్‌బీకేలతో కనీస మద్దతు ధర



రబీలో సొంతంగా, కౌలుకు తీసుకుని సుమారు 20 ఎకరాల్లో రబీ సాగు చేశాను. మంచి దిగుబడి వచ్చింది. ఆర్‌బీకేల ద్వారా ధాన్యం అమ్మడం వల్ల కనీస మద్దతు ధర లభించింది. ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్‌బీకేలన్నవి అన్నివిధాలా రైతుకు కొండంత అండగా నిలబడుతున్నాయి.

- చింతా నాగ మునీంద్రరావు, రైతు, కర్రివానిరేవు

రైతు భరోసా సాయంతో ఊరట



ప్రస్తుత ఖరీఫ్ సాగుకు ప్రభుత్వం రైతు భరోసా, కిసాన్ పథకంలో మొదటి దఫాగా రూ.7,500లు నా బ్యాంకు ఖాతాలో జమ చేసింది. ఇది పెట్టుబడికి ఎంతగానో ఉపయోగపడుతుంది. అలాగే రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీపై విత్తనాలు అందజేస్తున్నారు.

- పెయ్యల శ్రీనివాసరావు, రైతు, గాడిలంక

జగనన్న పాల వెల్లువతో పాడి రైతులకు లబ్ధి



సంఘంగా ఏర్పడిన మహిళా పాడి రైతులతో సర్పంచ్ చిరంజీవిరావు తదితరులు

అల్లవరం: పాడి రైతులు ఆర్థికంగా స్థిరపడాలన్న ఉద్దేశంతో జగనన్న పాల వెల్లువ పథకాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతుందని పశువైద్యాధికారి ఎంవీవీఎస్ఎల్ నారాయణ రావు అన్నారు. గూడాల గ్రామ సచివాలయంలో సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు అధ్యక్షతన శనివారం జగనన్న పాల వెల్లువపై పాడి మహిళా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు పాడి రైతుల నుంచి పాలు కొనుగోలు చేసి ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న అమూల్ కంపెనీకి సరఫరా చేస్తారని తెలిపారు. ఎంపిక చేసిన గ్రామాల్లో 11 మంది మహిళా రైతులను సంఘాలుగా ఏర్పాటుచేసి పది రోజులకు ఒకసారి పాలు డబ్బులను లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేస్తామన్నారు. అనంతరం మహిళా పాడి రైతులను సంఘంగా ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఏపీఎం సయ్యద్, పి.శ్రీమన్నారాయణ, శివరామకృష్ణ, వీఓఏ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి సమస్యలపై ఆరా



క్షేత్రస్థాయిలో సమస్యలపై ఆరా తీస్తున్న మున్సిపల్ కమిషనర్ నాయుడు తదితరులు



ఎన్.కొత్తపల్లిలో జగనన్న సురక్ష సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో గౌరీకుమారి

అమలాపురం టౌన్: జగనన్న సురక్ష పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు పట్టణంలో పరిష్కారం కాకుండా ఉన్న సమస్యలను గుర్తించేందుకు మున్సిపల్ కమిషనర్‌తో పాటు వార్డు సచివాలయాల అడ్మిన్లు, వలంటీర్లు క్షేత్ర స్థాయిలో ఇంటింటా పర్యటిస్తున్నారు. అమలాపురం మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు పట్టణంలోని రావుల చెరువు ప్రాంతంలో శనివారం ఇంటింటికీ వెళ్లి జగనన్న సురక్ష ద్వారా ఇంకా పరిష్కరించాల్సిన సమస్యలేమైనా ఉన్నాయా అంటూ ఆరా తీశారు. రావుల చెరువు నుంచి కేవలం మూడు సమస్యలు మాత్రమే వచ్చాయని, జులై 1వ తేదీ నుంచి మొదలయ్యే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ నాయుడు తెలిపారు. పట్టణంలోని 15 వార్డు సచివాలయాల పరిధిలో తమ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటారని కమిషనర్ నాయుడు చెప్పారు.

గ్రామాల్లో జగనన్న సురక్ష

ఉప్పలగుప్తం: ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో నిర్వహించడానికి సర్వే ప్రారంభించినట్టు ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి తెలిపారు. మండలంలోని ఎన్.కొత్తపల్లి, వానపల్లిపాలెం గ్రామ సచివాలయాల్లో బుధవారం ఆమె పర్యటించి వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. జులై 1వ తేదీ నుంచి మండల పరిధిలోని ప్రతి గ్రామంలో నెల రోజుల పాటు పర్యటించి సమస్యలు తెలుసుకుంటామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి దాసరి కృష్ణాజీ, వీఆర్వో వెంకటరమణ, పార్టీ నాయకులు బొడ్డు నాగేశ్వరావు, కుంచే చిన్ని తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసలు కావొద్దు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఈబీ సీఐ వేణుమాధవ్

అమలాపురం టౌన్: గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలకు యువత బానిసలై అనారోగ్యాలను కొని తెచ్చుకోవొద్దని అమలాపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) ఇన్‌చార్జి సీఐ ఎన్ఎస్ వేణుమాధవ్ సూచించారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక నల్ల వంతెన వద్ద గల పరంజ్యోతి జూనియర్, మిరియాం డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో శనివారం సాయంత్రం జరిగిన అవగాహన సదస్సులో సీఐ వేణుమాధవ్ మాట్లాడారు. క్రమశిక్షణతో కూడిన విద్య నేర్చుకుంటూ తల్లిదండ్రుల ఆకాంక్షలను, మీ జీవిత లక్ష్యాలను సాధించుకోవాలని విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్ కలిగి ఉండడం, అమ్మడం, సేవించడం వంటి నేరాలకు దాదాపు 10 ఏళ్ల నుంచి 20 ఏళ్ల జైలు శిక్ష పడుతుందని సీఐ వేణుమాధవ్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్ఐ సీహెచ్ స్వామిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నల్లా తమ్మేశ్వరరావు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి

ముమ్మిడివరం: యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా విద్య, క్రీడలపై దృష్టి సారించి డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలని ఎస్ఈబీ సీఐ ఎన్ఎస్ వేణుమాధవ్ పేర్కొన్నారు. ముమ్మిడివరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎంజీఆర్ జూనియర్ కళాశాల, ఉషాకిరణ్ ఐటీఐల్లో శనివారం ఎస్ఈబీ ఎస్ఐ రాజేష్ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఎవరైనా డ్రగ్స్ కలిగి ఉంటే సమాచారాన్ని టోల్‌ఫ్రీ నెంబరు 14500కి కాల్ చేసి చెప్పాలని సూచించారు. ప్రిన్సిపాల్ డా.ప్రభాకర్, ఎన్.మంగారామ్, ఎం.త్రిమూర్తులు, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే నెల 1 నుంచి ఇంటి వద్దకే సరకులు

తాళ్లరేవు: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే వైఎస్సార్ సంపూర్ణ పోషణ సరకులను వచ్చే నెల 1వ తేదీ నుంచి ఇంటి వద్దకే అందజేస్తామని తాళ్లరేవు ఐసీడీఎస్ సీడీపీఓ వి.మాధవి తెలిపారు. శనివారం చొల్లంగి పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ బూరెల సూర్యప్రభావతి అధ్యక్షతన గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బూరెల వెంకట్రాజు, ఐసీడీఎస్ విస్తరణాధికారి ఎస్.లలితా నిర్మల, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కాపవరపు శ్రీదేవి, ఉపసర్పంచ్ స్వర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమ వెలుగులు

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- గోగుల్లంక పంచాయతీలో గడప గడపకూ..



గోగుల్లంకలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

ఐ.పోలవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గడప గడపకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ఐ.పోలవరం మండలం గోగుల్లంకలో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ వారికి అందుతున్న సంక్షేమ లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. మధ్యవర్తులతో ప్రమేయం లేకండా ఒక్క బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారని తెలిపారు. గడపగడపకూ సంక్షేమ ఫలాలు చేరడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని వాటిని సైతం సీఎం జగన్ 98 శాతం నెరవేర్చారన్నారు. వైఎస్సార్ సీపీ సంక్షేమ పాలనపై ప్రజలు ఆలోచించి అండగా నిలవాలన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కోసం రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, పార్టీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, సర్పంచ్ కాకర్లపూడి గీత, ఎంపీటీసీ జ్యోతి, ఢిల్లీ నారాయణ, మెండా వెంకన్నబాబు, కసిలింక నరసింహమూర్తి, పిన్నంరాజు బాబ్జిరాజు, ఈతకోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి శుద్ధిపై కేంద్ర బృందం పరిశీలన



గ్రామసభలో తాగునీటిని పరీక్షిస్తున్న కేంద్ర బృందం ప్రతినిధులు

అల్లవరం: జాతీయ జల జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా అల్లవరం మండలంలో ప్రజలకు అందిస్తున్న తాగునీటి స్వచ్ఛత, శుద్ధిపై కేంద్ర బృందం ఐదు గ్రామాల్లో శనివారం పరిశీలన చేసింది. బోడసకుర్రు ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు నుంచి గోడిలంక గ్రామానికి సరఫరా చేస్తున్న తాగునీటిని, గుండెపూడి ప్రాజెక్టు నుంచి తూర్పులంక, రెల్లుగడ్డ, దేవగుప్తం, గుండెపూడి గ్రామాల్లో ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటి శుద్ధతను కేంద్ర బృందం ప్రతినిధులు గాజ్నఫర్ అహ్మద్, రాజేష్ కేఆర్ బన్సాలీలు శనివారం పరిశీలించి గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా జలజీవన్ మిషన్ ద్వారా పంపిణీ చేస్తున్న తాగునీరు రంగు మారిందా, వాసన వస్తుందా, తాగునీరు సరఫరా చేసే ప్రాంతాల వద్ద పరిశుభ్రత పాటిస్తున్నారా లేదా అని స్థానిక మహిళలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి అవసరాలకు సరఫరా చేస్తున్న తాగునీటిలో మూలకాలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సీహెచ్ఎస్‌వీ కృష్ణారెడ్డి, డీఈ పార్థసారథి, రాజోలు డీఈ రామప్రసాద్, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్‌లు రుద్రరాజు లక్ష్మీపతిరాజు, కడల గంగాచలం, ఎస్.సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి



యువకుడిపై దాడి చేస్తున్న వ్యక్తులు

కాట్రేనికోన: యువకుడిపై ఐదుగురు వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం ప్రకారం కందికుప్ప శివారు గండి ప్రాంతంలో చెరువులను అంకాడి గోవిందు, చొల్లంగి శ్రీనివాస్‌లు లీజుకు తీసుకుని సాగు చేస్తున్నారు. చెరువుల వద్ద మోటారు విషయమై ఈ నెల 13న ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. విషయం తెలియడంతో చొల్లంగి శ్రీనివాస్ కుమారుడు సాయి, అతడి సోదరుడు ఉదయ భాస్కర్, మరో ఇద్దరు అమలాపురం నుంచి చెరువు వద్దకు వచ్చారు. అక్కడ చొల్లంగి శ్రీనివాస్, వారి కుమారులు, మిగిలిన ఇద్దరు కలిసి తన కుమారుడు శ్రీనుపై దాడికి పాల్పడ్డారని గోవిందు ఆరోపించాడు. వారిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే తనను కులం పేరుతో దుర్భాషలాడారంటూ చెరువు వద్ద పని చేస్తున్న గిరిజన మహిళ ఎస్.సరస్వతి పేర్కొంది. దాడిపై ఫిర్యాదు చేసి, పది రోజులు గడిచినా పోలీసులు కేసు నమోదు చేయలేదని బాధితులు పేర్కొన్నారు. ఈ విషయమై ఎస్ఐ టి.శ్రీనివాస్‌ను వివరణ కోరగా చెరువు లావాదేవీల విషయంలో ఇరుపక్షాలూ పిడిగుద్దులు గుద్దుకున్నారని, రెండు వర్గాలనూ పిలిచి మాట్లాడామని చెప్పారు. కులం పేరుతో దూషించారంటూ సరస్వతి చేసిన ఆరోపణలపై సంఘటన స్థలానికి వెళ్లి విచారణ జరిపామని, ఆమె ఫిర్యాదులో వాస్తవం లేదని ఎస్ఐ చెప్పారు.

మానసిక ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



మానసిక ఆరోగ్యంపై గీసిన సందేశాత్మక చిత్రాలతో విద్యార్థినులు, డాక్టర్ సౌమ్య తదితరులు

అమలాపురం టౌన్: విద్యార్థులు మానసిక ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, అన్ని వేళలా అవగాహనతో ఉండడం ద్వారానే అది సాధ్యమని అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మానసిక వైద్యురాలు డాక్టర్ సౌమ్య పసుపులేటి అన్నారు. డిస్ట్రిక్ట్ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్‌లో భాగంగా స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు మానసిక ఆరోగ్యంపై శనివారం జరిగిన అవగాహన సదస్సులో డాక్టర్ సౌమ్య మాట్లాడారు. నెలసరి సమయంలో ఇన్‌ఫెక్షన్స్‌కు గురి కాకుండా తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్లు సీహెచ్ బాబి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీల వితరణ



బెంచీల వితరణ ప్రారంభిస్తున్న దాత భీమరావు తదితరులు

అల్లవరం: మండలంలోని పెదపేటలోని ఎంపీపీ పాఠశాలకు గ్రామానికి చెందిన ఉండ్రు భీమారావు, మైథిలి దంపతులు తమ వంతు సాయంగా ఐరన్ బెంచీలతో పాటు విద్యార్థులకు ట్రాక్ షూట్లు, కంచాలు, గ్లాసులు శనివారం అందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సర్పంచ్ సాధనాల వెంకట సూర్యనాగమణి తదితరులు మాట్లాడుతూ భీమారావు దంపతులు గత ఇరవై ఏళ్లుగా గ్రామానికి అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు ఉండ్రు వెంకటేష్, మాజీ సర్పంచ్ గోసంగి స్టాలిన్‌బాబు, నందిక సిద్ధార్థకుమార్, ఉండ్రు బాబ్జి, చింతా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్‌కు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో జిల్లా చెస్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అండర్-9 జిల్లా స్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ చూపిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో ఆలమూరు మండలం మడికి గ్రామానికి చెందిన పితాని ధ్యాన సత్య కార్తీక్ (ప్రథమ), ఆలమూరు మండలం చొప్పెల్లకు చెందిన గుత్తుల వెంకట శివరామ్ (ద్వితీయ), అమలాపురానికి చెందిన అంకెం తరుణ్ తేజ (తృతీయ) స్థానాల్లో నిలిచారు. అలాగే, బాలికల విభాగంలో అల్లవరం మండలం బెండమూర్లంకకు చెందిన గిడుగు వాత్సల్య (ప్రథమ), ఆలమూరుకు చెందిన చిప్పాడ గీతిక (ద్వితీయ) స్థానాలు సాధించారు. ఈ ఐదుగురూ శని, ఆదివారాల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు శనివారం ఉదయం బయలుదేరి వెళ్లారు. అమలాపురం విక్టరీ అకాడమీ కన్వీనర్ తాడి వెంకట సురేష్ ఈ వివరాలు తెలిపారు. విజేతలకు జిల్లా చెస్ ప్రతినిధులు యర్రంశెట్టి చక్రధరుడు, వంకాయల సుబ్బారావులు బహుమతులు అందించి, అభినందించారు.

ప్రభుత్వ కోటా ద్వారా 389 సీట్ల భర్తీ

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న నాలుగు మెడికల్ కళాశాలల్లో ప్రభుత్వ కోటా ద్వారా 389 ఎంబీబీఎస్ సీట్లను భర్తీ చేస్తామని సీఎం రంగసామి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇందిరాగాంధీ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఉన్న 150 ఎంబీబీఎస్ సీట్లకు నేషనల్ మెడికల్ కమిషన్ అనుమతిచ్చిందన్నారు. ఇందిరా గాంధీ మెడికల్ కళాశాలను విస్తరించనున్నట్లు, నర్సింగ్ కళాశాలను సైతం ఆధునీకరించనున్నట్లు తెలిపారు. నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ ఏడాది మెరిట్ ప్రాతిపదికన అడ్మిషన్లు ఉంటాయన్నారు.

మాజీ సైనికుల పిల్లలకు నగదు బహుమతులు

యానాం: 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి, ఇంటర్మీడియట్‌ల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన మాజీ సైనికుల పిల్లలకు నగదు అవార్డును అందజేస్తున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, పిజీ పరీక్షల్లో గోల్డ్‌మెడల్ సాధించిన వారికి సైతం నగదు బహుమతి అందిస్తామన్నారు. అర్హులైనవారు ఈ నెల 28వ తేదీలోగా రిజిస్టర్ చేసుకుని దరఖాస్తును ఆగస్టు 4వ తేదీలోగా ఆర్ఏఓకు అందించాలన్నారు.

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

యానాం: యానాం పీడబ్ల్యూడీ శాఖ సిబ్బంది టౌన్ వాటర్ వర్క్స్‌లో నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ నెల 26న నియోజవర్గ పరిధిలోని మెట్టకూరు, గోపాల్‌నగర్, అంబేడ్కర్‌నగర్, కురసాంపేట ప్రాంతాలకు తాగునీటి సరఫరాకు అంతరాయం కలగనుందని సంబంధిత అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

వెలెనెస్ సెంటర్ల తనిఖీ



వెలెనెస్ సెంటర్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ దుర్గారావుదొర

అమలాపురం రూరల్: మండలంలోని పేరూరు-4, రోళ్లపాలెం, చిందాడగారువు సచివాలయాల పరిధిలోని హెల్త్ అండ్ వెలెనెస్ సెంటర్లను జిల్లా వైద్యాధికారి డాక్టర్ దుర్గారావుదొర శనివారం తనిఖీ చేశారు. గర్భిణుల నమోదు, రక్తహీనత, కంటివెలుగు, ఇతర రిజిస్టర్లను పరిశీలించారు. ప్రజలకు, గర్భిణులకు మరిన్ని సేవలు అందించాలని, ప్రభుత్వ యాప్‌లో రోజూ తప్పనిసరిగా వివరాలు నమోదు చేయాలని ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలను ఆదేశించారు. జిల్లా వైద్యాధికారి వెంట స్థానిక వైద్యాధికారిణి డాక్టర్ ములపర్తి శాంతిలక్ష్మి, ఆరోగ్య విస్తరణాధికారి రామకృష్ణమూర్తి తదితరులున్నారు.